ఎంపీకి వినతి



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం: తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని హయత్‌నగర్ డివిజన్ పరిధి వనస్థలిపురం కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సభ్యులు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, సంగ్రామ్, జగదీష్, సత్యానారాయణ, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



బాక్స్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సూచించారు. డివిజన్ పరిధిలోని గోల్డెన్ విల్లాస్ దగ్గర డీఆర్‌ఎఫ్, సీఎన్‌డీ ప్లాంట్ వరకు వేస్తున్న బాక్స్ లైన్ పనులను బుధవారం కార్పొరేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం రాకముందే బాక్స్ లైన్ పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీవాసులు భద్రయ్య పాల్గొన్నారు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

వనస్థలిపురం: సీఎంఆర్‌ఎఫ్ ఎంతోమంది పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను బుధవారం ఆయన వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మలక్‌పేట: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుజయ్‌కుమార్(23) రెండేళ్ల నుంచి దిల్‌సుఖ్‌నగర్ మెహఫిల్ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. గతేడాది వివాహం కాగా భార్యతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లో ఉండేవాడు. భార్య గర్భవతి కావడంతో ఆమె ఒరిస్సాలోని సొంత గ్రామానికి తీసుకెళ్లాడు. ఈ నెల 28న నగరానికి వచ్చి మళ్లీ పనిలో చేరాడు. సాయంత్రం విశ్రాంతి తీసుకుంటానని గదికి వెళ్లిన సుజయ్‌కుమార్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

కలిసికట్టుగా హక్కులు కాపాడుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: సీనియర్ సిటిజన్స్ కలిసికట్టుగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు రావుల నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం చిత్రలేవుట్ కాలనీ సీనియర్ సిటిజన్స్ కార్యవర్గం సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. సీనియర్ సిటిజన్స్ సంఘం అభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టు పనిచేయాలని సూచించారు. సీనియర్స్ సిటిజన్ ఫోరం కోసం నిరంతరం కృషి చేసిన ముస్కు అంజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామ చంద్రారెడ్డిను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో నారాయణరెడ్డి, నర్సింగ్‌రావు,ఇంద్రసేనారెడ్డి, మధసూదన్‌రెడ్డి, రామచంద్రరావు, నర్సింహ్మాగౌడ్,గోవర్ధన్, ఉదయ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మన్సూరాబాద్: వర్షాకాలంలో కాలనీలు ముంపునకు గురికాకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాక్సు నాలా పనులను చేపట్టడం జరిగిందని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సహారా ఎస్టేట్‌లో చేపడుతున్న బాక్సు నాలా పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సయ్యద్ జానీ, జ్ఞానేశ్వర్, రాఘవేందర్, కృష్ణారెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పార్కులా.. సిట్టింగ్ అడ్డాలా?

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్న వైనం
- దృష్టి సారించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



పార్కులో పేరుకుపోయిన చెత్తా చెదారం

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధి హస్తినాపురం, వనస్థలిపురం, చంపాపేట, లింగోజిగూడ డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని పార్కులపై పర్యవేక్షణ కరువై పచ్చని చెట్లతో కళకళ లాడాల్సిన పార్కులు కళావిహీనంగా మారుతున్నాయి. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు సేదతీరేందుకు పార్కులకు వెళ్దామంటే సౌకర్యాలు లేక, ఎండిపోయిన చెట్లు, నరికివేసిన చెట్ల కొమ్మలు, ముళ్ల చెట్లు, తాగి పడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నిస్తే దాడులు..

ఆయా పార్కుల్లో మద్యం తాగి అక్కడే సీసాలు పారవేస్తుండటంతో సందర్శకులకు ఇబ్బందిగా మారుతోంది. మద్యం మత్తులో కొందరు గొడవలకు దిగుతున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులకు సైతం దిగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సర్కిల్ పరిధి వనస్థలిపురంలోని పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో ఉన్న ప్లే గ్రౌండ్‌లో రాత్రి ఏడు దాటిందంటే చాలు ఆకతాయిలు రెచ్చిపోయి గొడవలకు దిగుతున్నారని, అర్ధరాత్రి వరకు ఈ పార్కులో గుంపులు, గుంపులుగా తిష్ట వేసి మద్యం తాగుతూ నానా హంగామా చేస్తున్నారని పలువురు భయాందోళనకు గురవుతున్నారు. మరికొందరు గంజాయి మత్తులో తాగుతూ నానా హంగామా చేస్తున్నారని, అడ్డువచ్చిన వారిపై దాడులు చేయడానికి కూడా వెనకాడడం లేదని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

నిఘా పెంచాలి..

పార్కులలో తాగిడేసిన మద్యం బాటిళ్ల వల్ల స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఉదయం వాకింగ్ వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. పార్కులలో రాత్రి సమయంలో మద్యం తాగుతూ పెద్దపెద్ద శబ్దాలుచేస్తూ, అరుపులు, కేకలు వేస్తుండడంతో పార్కు సమీపంలోని ఇళ్లలోకి శబ్దాలు వస్తున్నాయని, దీంతో చిన్న చిన్న పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి పార్కులపై నిరంతరం నిఘా పెట్టి ఆకతాయిలపై చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.



పార్కులో మద్యం సీసాలు



అధ్వానంగా మరుగుదొడ్లు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

వనస్థలిపురం: వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ల పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన రేకులషెడ్లు, డబ్బాలను బుధవారం తొలగింపజేశారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న చిరువ్యాపారుల డబ్బాలను తొలగిస్తుండగా కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అడ్డుకున్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చిరువ్యాపారులు జీహెచ్‌ఎంసీ అధికారుల అనుమతితో డబ్బాలు వేసుకున్నారని, రూ. వేలు వెచ్చించి శాశ్వతంగా ఉండేలా ఇనుప డబ్బాలు వేసుకున్నారని నాయకులు పేర్కొన్నారు. దీంతో సిబ్బంది వాటిని తొలగించకుండానే వెళ్లిపోయారు. అయితే.. కొన్ని ఆక్రమణలనే తొలగించడంపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్కారు విద్యార్థులు.. సత్తా చాటారు

- సైదాబాద్ జోన్‌లో 94 శాతం ఉత్తీర్ణత



పి.మాధురి 539 మలక్‌పేట టాపర్
బి.పావని 535 శంకేశ్వరబజార్

సైదాబాద్: పదో తరగతి ఫలితాల్లో సైదాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. సైదాబాద్ జోన్ పరిధిలో మొత్తం 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా బాలురు 195 మంది, బాలికలు 233 మందితో కలిపి మొత్తం 428 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. బుధవారం ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో 176 మంది బాలురు, 226 మంది బాలికలు మొత్తం 402 మంది ఉత్తీర్ణులయ్యారు. సైదాబాద్ జోన్ పరిధిలోని మాదన్నపేట, కాచిగూడ, మలక్‌పేట అంధ బాలల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణతను సాధించారు. జోన్ పరిధిలో అత్యల్పంగా మూసారిమో, మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 87 శాతం ఉత్తీర్ణత మాత్రమే పొందారు. అదే విధంగా జోన్ పరిధిలోని కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బి.పావని 562 మార్కులతో జోన్ టాపర్‌గా నిలిచింది. మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి.మాధురి 539 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంకేశ్వరబజార్ పాఠశాలలో..

సైదాబాద్‌లోని శంకేశ్వరబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 70 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 67 మంది ఉత్తీర్ణులయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. బి.పావని 535 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో 96 శాతం ఫలితాలు సాధించామన్నారు.

నాగోలులో..

నాగోలు: నాగోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 157 మంది పరీక్షలకు హాజరు కాగా 140 మంది ఉత్తీర్ణత సాధించారు. చైతన్య 531 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించింది. శ్రీనిత్‌గౌడ్ 529 మార్కులు, చరణ్‌తేజ్ 524 మార్కులు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీలక్ష్మీ తెలిపారు.

కొత్తపేట పాఠశాలలో..

కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో 100 మంది పరీక్షకు హాజరుగా కాగా 81 మంది ఉత్తీర్ణత సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు. దివ్య 527 మార్కులు, యశస్విని 521, నవీన్ 513, సహస్ర 512 మార్కులు సాధించారని వెల్లడించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రంతిస్తున్న సీపీఎం నాయకులు

హయత్‌నగర్: మండలం ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ భూమిలో స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు బుధవారం హయత్‌నగర్ తహసీల్దార్ జానకికి వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రమోహన్, కమిటీ సభ్యులు కీసరి నర్సింహా మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 71లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని, అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో పట్టాలు ఇవ్వాలని గతంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని మరోసారి తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. గతంలో ఆ సర్వేనెంబర్‌లోని భూమిలో ఇళ్లు నిర్మించేందుకు యత్నించిన వారిపై పెట్టిన కేసులను విరమించుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఆలేటి ఎల్లయ్య, వెంకన్న, కృష్ణయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి



బసవేశ్వర విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: బసవేశ్వర జయంతి వేడుకలను బుధవారం వనస్థలిపురం డబుల్ బెడ్రూమ్స్ సమీపంలో ఉన్న బసవేశ్వర విగ్రహానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దీపావళి శ్రావణ్ కుమార్, నాయకులు శ్రీధర్ గౌడ్, సంజయ్‌కుమార్, రాంమోహన్, ప్రభాకర్, చంద్రప్ప, శ్రీకాంత్, సతీష్ కుమార్, మల్లికార్జున్, బాలుమహేంద్ర, మనోజ్‌కుమార్, కుషాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

బసవేశ్వరస్వామి జయంతి సందర్భంగా వనస్థలిపురం రైతుబజారు సమీపంలోని బసవేశ్వరస్వామి విగ్రహానికి పీసీసీ మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి నివాళులర్పించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం దేవాలయంలో సూర్యప్రభ వాహనసేవ, గజవాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరీశెట్టి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ అయోధ్యనగర్‌లో వేధిస్తున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం ఆయన పలు కాలనీల్లో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. డ్రైనేజీ, తాగునీటి వసతి, రోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏఈ ముబిన్ పాషా, వాటర్‌వర్క్స్ డీజీఎం హస్మత్ అలీ, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, అయోధ్యనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని డబ్బులు వసూలు

హయత్‌నగర్: మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జడ్చర్ల మల్లెబోయినపల్లికి చెందిన సంతోష్ చౌహాన్‌కు, హయత్‌నగర్ గౌతమ్‌నగర్‌కు చెందిన కుక్కడపు చంద్రకాంత్‌గౌడ్‌తో మూడేళ్ల క్రితం వనస్థలిపురంలో పరిచయం ఏర్పడింది. కరీంనగర్‌లోని చెలిమెడ మెడికల్ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాలో సంతోష్‌కు సీటు ఇప్పిస్తానని చంద్రకాంత్‌గౌడ్ నమ్మించాడు. అతని తండ్రి బాలునాయక్‌తో రూ.98 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు.పలు విడతలుగా చంద్రకాంత్‌గౌడ్ రూ. 52 లక్షలు వసూలు చేశాడు. ఇంతలోనే సంతోష్‌కు కౌన్సెలింగ్‌లోనే సీటు వచ్చింది. మేనేజ్‌మెంట్ కోటా సీటు అవసరం లేదు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాలునాయక్ కోరగా రూ. 26 లక్షలు తిరిగి ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వకుండా వాయిదా వేస్తూ వచ్చాడు. నాకు అధికార పార్టీ నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయి మీరు ఏం చేయలేరని బెదిరిస్తుండటంతో బాలునాయక్ పోలీసులకు ఫిర్యాదు మేరకు బుధవారం చంద్రకాంద్ గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోవాలి



నాగోలు: వీధి వ్యాపారాలు చేసుకునేవారు రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత శ్రీధర్ అన్నారు. బుధవారం డిప్యూటీ కమిషనర్ అధ్యక్షతన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీ సుజాత శ్రీధర్ మాట్లాడుతూ..వీధి వ్యాపారులకు లోన్స్, రెగ్యులర్ రీపేమెంట్, ఇన్సూరెన్స్, చెత్తను రోడ్లపై వేయకుండా చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ విక్రాంత్ రెడ్డి, శానిటేషన్ డీఈ చందన, సహదేవ్, వీధి వ్యాపారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీలోని శ్రీభ్రమరాంభ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దైవభక్తితో ప్రజలందరూ భగవంతుని పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, పోచబోయిన జగదీష్‌యాదవన్, ఆలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ క్యాండిల్ ర్యాలీ

హయత్‌నగర్: కశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం వర్ధనగర్‌కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ర్యాలీలో కాలనీ అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నరేష్‌రెడ్డిస్వామి, నర్సింహా పాల్గొన్నారు.





ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్-1లో ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేసిన ఓపెన్ జిమ్ పనులను బుధవారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో యువకులు, వృద్ధులు వ్యాయామం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఉద్యానవనాన్ని పరిశించిన కార్పొరేటర్ కాలనీవాసులతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీసంక్షేమ సంఘం అధ్యక్షులు వెదిరే యోగేశ్వర రెడ్డి, మల్లారెడ్డి, నాగభూషణం, రాంరెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో యువతను ప్రోత్సహించాలి



స్కాలర్‌షిప్ చెక్కును ఆవిష్కరిస్తున్న అశ్విని

చైతన్యపురి: ఫ్యాషన్ డిజైనింగ్‌లో గ్రామీణ యవతను ప్రోత్సహించాలని బిగ్‌బాస్ ఫేమ్, నటి అశ్విని అన్నారు. చైతన్యపురిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో అశ్విని సందడి చేశారు. 2025-26 సంవత్సరానికి నిర్వహించిన స్కాలర్‌షిప్ పరీక్ష-1 నిర్వహించే తేదీలు, టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అందించే ఆర్థిక సహాయం రూ.15 లక్షల చెక్కును ఆమె చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడుతూ.. ప్రజల జీవనశైలిలో మార్పులు రావటం ముఖ్యంగా ఫ్యాషన్ వైపు యువత మహిళలు ఆసక్తి చూపుతున్నారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఫ్యాషన్ బోటిక్స్‌పై ఆదరణ పెరుగుతుందన్నారు. నిఫ్డ్ లాంటి సంస్థలు స్కాలర్‌షిప్‌లు అందజేస్తూ వారిని ప్రోత్సహించటంపై డైరెక్టర్ కన్నెబోయిన రాము యాదవ్‌ను అభినందించారు. సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన మహిళలకు స్కాలర్‌షిప్‌లు అందజేసి ప్రోత్సహిస్తున్నామని స్కాలర్ షిప్ పరీక్ష ఈ నెల 25న నిర్విస్తున్నామని, 24 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.